ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
మంగళవారం 30 ఏప్రిల్ 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కినలెస్
యాదాద్రి	రూ.140	203	231
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.140	204	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 42.0 । కనిష్ఠం 25.2

బరిలో 61 మంది

» భువనగిరి నుంచి 39 మంది » నల్లగొండ నుంచి 22 » స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల ఖరారుతో ప్రచారానికి సన్నద్ధం

పార్లమెంట్ ఎన్నికల సంగ్రామంలో నిలిచే అభ్యర్థులెవరనేది తేలిపోయింది. సోమవారం ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన అనంతరం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు స్థానాలకు 61 మంది బరిలో ఉండగా అందులో నల్లగొండ పార్లమెంట్ స్థానానికి నుంచి 22 మంది, భువనగిరి స్థానంలో 39 మంది ఉన్నారు. వారికి ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించారు. ఇక ప్రచారాన్ని ముమ్మరం చేయడమే తరువాయి. ప్రధాన అభ్యర్థులు ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించగా, గుర్తుల కేటాయింపులతో స్వతంత్రులు ప్రచార రంగంలోకి దిగనున్నారు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

లోక్‌సభ ఎన్నికల్లో పోటీలో ఉండే అభ్యర్థులు ఖరారయ్యారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ జరగ్గా, 26వ తేదీన పరిశీలన, సోమవారం ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గానికి 61 మంది నామినేషన్లు దాఖలు చేయగా, 10 మంది నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. 51 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్టుగా గుర్తించారు. సోమవారం 12మంది స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల అధికారి హన్మంతు కే జెండగే వెల్లడించారు. దీంతో భువనగిరి పార్లమెంట్ ఎన్నికల బరిలో 39మంది మిగిలారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎంలకు చెందిన అభ్యర్థులు ఇప్పటికే ప్రచార రథాలను ఏర్పాటు చేసుకుని ముమ్మరంగా పర్యటిస్తున్నారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డి(కాంగ్రెస్), క్యామ మల్లేష్(బీఆర్ఎస్), డాక్టర్ బూర నర్సయ్యగౌడ్(బీజేపీ), ఎండీ జహంగీర్(సీపీఎం)తో పాటు గుర్తింపుపొందిన పార్టీల, గుర్తుల కేటాయింపు పూర్తికావడంతో స్వతంత్ర అభ్యర్థులు ప్రచారపర్వంలోకి రానున్నారు. వారు కూడా ప్రచార రథాలను సిద్ధం చేసుకోనున్నారు.

నల్లగొండ స్థానంలో

నల్లగొండ పార్లమెంట్ స్థానానికి 22 మందిలో బరిలో నిలిచారు. నామినేషన్ల పరిశీలన అనంతరం 31మంది మిగలగా, సోమవారం 9మంది నామినేషన్లను ఉపసంహరించున్నారు. ఎన్నికల బరిలో 22 మంది నిలిచారు. ఈ మేరకు ఎన్నికల అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం గుర్తులను కేటాయించారు.

ప్రధాన పార్టీలు కాంగ్రెస్ నుంచి కుందూరు రఘువీర్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి కంచర్ల కృష్ణారెడ్డి, బీజేపీ నుంచి శానంపూడి సైదిరెడ్డి పోటీలో నిలిచారు.

నల్లగొండ పార్లమెంట్ స్థానంలో



కుందూరు రఘువీర్‌రెడ్డి(కాంగ్రెస్) కంచర్ల కృష్ణారెడ్డి, (బీఆర్ఎస్) శానంపూడి సైదిరెడ్డి(బీజేపీ)

భువనగిరి పార్లమెంట్ స్థానంలో



కిరణ్‌కుమార్ రెడ్డి (కాంగ్రెస్)



క్యామ మల్లేష్ (బీఆర్ఎస్) బూర నర్సయ్య గౌడ్ (బీజేపీ) ఎండీ జహంగీర్ (సీపీఎం)

ఇక ముమ్మర ప్రచారానికి..

సార్వత్రిక ఎన్నికలకు మరో 14 రోజులు మాత్రమే ఉంది. పోలింగ్ మే 13వ తేదీన ఉండటంతో ప్రచారానికి గడువు సమీపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు తమ అనుచరులతో ముమ్మరంగా ప్రచారాన్ని చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రచార రథాలు గ్రామాల్లో, పట్టణాల్లో తిరుగుతూ గెలిపించాలని కోరుతున్నారు. భువనగిరి లోక్‌సభ పరిధిలో భువనగిరి, ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్, ఇబ్రహీంపట్నం, జనగామ నియోజకవర్గాలు ఉన్నాయి. నియోజకవర్గాల వారీగా అగ్రనేతలతో బహిరంగ సభలు నిర్వహించేందుకు అన్నిపార్టీల నేతలు సన్నద్ధమవుతున్నారు. మే 3న ప్రధాని నరేంద్రమోదీతో బీజేపీ భారీ బహిరంగసభను నిర్వహిస్తోంది. చౌటుప్పల్‌లో నిర్వహించే ఈ సభకు జిల్లా నుంచి జనం తరలివెళ్లేలా పార్టీ నాయకులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు వాహనాలు సిద్ధం చేస్తున్నారు. మిగతా పార్టీల వారు కూడా పలు చోట్ల బహిరంగసభలు నిర్వహించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని ఆయా పార్టీల వర్గాలు వెల్లడించాయి.

ఎన్నికల వ్యయం నమోదుచేయాలి : కలెక్టర్

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 29 : అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని తప్పకుండా నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హన్మంతు కే జెండగే తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాబర్ట్‌సింగ్ క్షేత్రిమాయుమ్, ఎన్నిలక వ్యయ పరిశీలకుడు రాకేష్‌రంజన్, సాయన్ దేబర్మ సమక్షంలో 39 మంది అభ్యర్థులు, వారి ప్రతినిధులకు ఎన్నికల వ్యయంపై కలెక్టర్ వివరించారు. భువనగిరి లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మూడు రిజిస్టర్లల్లో ప్రతి రోజూ ఖర్చులు, నగదు వివరాలు, బ్యాంకు లావాదేవీలు న మోదు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో మూడుసా ర్లు అభ్యర్థి, అతను సూచించిన ప్రతినిధి ద్వారా ఎన్నికల ఖర్చు వివరాలు అందించాలన్నారు. కార్యక్రమంలో అదన పు కలెక్టర్లు బెన్ షాలోమ్, గంగాధర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ హన్మంతు కే జెండగే

కూలీలకు పనిప్రదేశంలో అన్నివసతులు కల్పించాలి

ఉపాధిహామీ రాష్ట్ర చీఫ్ విజిలెన్స్ అధికారి ఉష

భువనగిరి రూరల్, ఏప్రిల్ 29 : ఉపాధిహామీ కూలీలకు అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఉపాధిహామీ పథకం రాష్ట్ర చీఫ్ విజిలెన్స్ అధికారి, ఉమ్మడి నల్లగొండ ప్రత్యేక అధికారి కే ఉష ఆదేశించారు. సోమవారం భువనగిరి మండలం వడపర్తి, హన్మపురం గ్రామాల్లో ఉపాధిహామీ పనులను, ఆయా చోట్ల కూలీలకు కల్పిస్తున్న సౌకర్యాలు తాగునీరు, నీడ, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఆమె పరిశీలించారు. అదేవిధంగా జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతిఒక్కరికీ పనులు కల్పించాలని ఆదేశించారు. కూలీల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్‌రావు, ఏపీడీ శ్యామల, ఏపీవో బాలస్వామి, పంచాయతీ కార్యదర్శులు జుబేర్, శివారెడ్డి, టెక్నికల్ ఫీల్ అసిస్టెంట్లు నివేదిత, రాజమణి, సుధాకర్, సునందా తదితరులు ఉన్నారు.

స్వయం ఉపాధితో ఆదాయ మార్గాలు పెంపొందించుకోవాలి

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 29 : గ్రామీణ ప్రాంతాల్లో స్వయంఉపాధి ద్వారా ఆదా య మార్గాలు పెంపొందించుకోవాలని హైదరాబాద్‌లోని నేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్ఐఆర్‌డీ)లో రూరల్ డెవలప్‌మెంట్ కోర్సులో శిక్షణ పొందుతున్న వివిధ రాష్ట్రాల విద్యార్థుల బృందం సూచించింది. సోమవారం భూదాన్‌పోచంపల్లిలోని సహకార సంఘా న్ని 35 మంది విద్యార్థులు సందర్శించారు. అనంతరం చేనేత మగ్గాలను చేనేత కార్మికుల గృహాలను, మగ్గంపై చేనేత వస్త్ర తయారీతో పాటు వస్త్ర తయారీ ప్రక్రియలను పరిశీలించారు. కార్మికుల జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. చేనేత కార్మికులు రూపొందించిన కళాత్మక డిజైన్లతో రూపొందించిన చీరలను పరిశీలించి కార్మికుల ప్రతిభను ప్రశంసించారు. స్థానిక వస్త్ర దుకాణదారులను కలిసి వారి వ్యాపార నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ దేవప్రియ, ఫ్యాకల్టీ హైమావ తి, ప్రాజెక్టు అసిస్టెంట్ మాధవ, పోచంపల్లి చేనేత సహకార సంఘం మేనేజర్ రుద్ర ఆంజనేయులు పాల్గొన్నారు.



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

'గుత్తా' నిర్ణయంపైనే అందరి ఆసక్తి



సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అమిత్‌రెడ్డి దంపతులు

తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి, సోదరుడు జితేందర్‌రెడ్డి పార్టీ మారడం, తాను సైతం ఇప్పటికే బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే అంశంపై అందరిలో ఆసక్తి నెలకొంది. రాజ్యాంగబద్ధమైన పదవికావడంతో, పదవీకాలం పూర్తయ్యేంతవరకు పార్టీరహితంగా అలాగే కొనసాగుతారా? లేక ఆ పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతారా? అనే అంశంలో ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తేలాల్సి ఉంది. అదే సమయంలో బీఆర్ఎస్ అధిష్ఠానం సైతం మండలి చైర్మన్ విషయంలో ఎలా ముందుకు సాగుతుందో తెలితేనే సుఖేందర్‌రెడ్డి అంశంపై స్పష్టత రానుంది.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

కాంగ్రెస్ గూటికి అమిత్

» సీఎం సమక్షంలో చేరిక
» మదర్ డెయిరీ చైర్మన్ జితేందర్‌రెడ్డి సైతం
» గుత్తా ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి కోమటిరెడ్డి, పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షి

మునుగోడు ఉపఎన్నిక సమయంలో ఆ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దిగాలని భావించిన అమిత్‌రెడ్డికి అవకాశం దక్కలేదు. ఆ తదుపరి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా పోటీకి ప్రయత్నించినా వీలుకాలేదు. తాజాగా లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరి స్థానాల్లో ఏదోఒక చోట బరిలో ఉండాలని తొలుత భావించినా ఆ తర్వాత మాజీ ఎమ్మెల్యేలు సుముఖంగా లేకపోవడంతో పోటీ నుంచి విరమించుకున్నట్లు ప్రకటించారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు గుత్తా వర్గీయులు సహకరించలేదని, అందువల్లే పార్టీ అభ్యర్థులు ఓడిపోయారంటూ పలువురు మాజీ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసినప్పటి నుంచి గుత్తా సుఖేందర్‌రెడ్డికి, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యేలకు నడుమ కోల్డ్‌వార్, మాటల యుద్ధాలు నడిచాయి. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నప్పటికీ సుఖేందర్‌రెడ్డి సైతం పలు సందర్భాల్లో మీడియాతో పిచ్చాపాటిగా, ఇంటర్వ్యూల్లో మాట్లాడుతూ బీఆర్ఎస్ ఓటమికి అప్పటి మంత్రుల వైఖరే కారణమని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి నిజంగా తన వర్గమే కారణమైతే తాను బలవంతుడినని ప్రజలు గుర్తించినట్లేనని కూడా వ్యాఖ్యానించారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నానంటూనే పలు సందర్భాల్లో సుఖేందర్‌రెడ్డి సీఎం రేవంత్ పాలన బాగుందని కితాబిచ్చారు. బీఆర్ఎస్‌లో నియంతృత్వ విధానాలు అమలవుతున్నాయని, పార్టీలో సమీక్షలు, చర్చలు ఉండకపోవడం వల్లే పార్టీకి ఈ దుస్థితి తలెత్తిందని కామెంట్లు చేశారు. అదే సమయంలో అమిత్ బీఆర్ఎస్‌లో కొనసాగేందుకు విముఖత వ్యక్తం చేయడంతో పాటు పూర్వపు పరిచయాలు, బంధుత్వాల నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో సమావేశమయ్యారు. భువనగిరి నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారనే చర్చ కూడా కొనసాగింది. ఈ నేపథ్యంలో తాజాగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆహ్వానం మేరకు అమిత్‌రెడ్డి, ఆయన బాబాయి జితేందర్‌రెడ్డి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతానికి ఎలాంటి షరతులు లేకుండా పార్టీలో చేరినప్పటికీ భవిష్యత్‌లో తగిన ప్రాధాన్యం కల్పిస్తామని, అమిత్ రాజకీయ భవిష్యత్‌ని తమకు వదిలేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి హామీ ఇచ్చినట్లు సుఖేందర్‌రెడ్డి వర్గీయులు పేర్కొన్నారు.

ఆయన వర్గీయులు కాంగ్రెస్‌లోకే


సుఖేందర్‌రెడ్డి వర్గీయులుగా పేర్కొంటున్న పలువురు ప్రజాప్రతినిధులు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరగా, మిగిలినవారు కూడా అమిత్‌బాటలో కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. నల్లగొండ, దేవరకొండ, మునుగోడు తదితర నియోజకవర్గాల్లో కొందరునేతలు ఇప్పటికే కాంగ్రెస్ గూటికి చేరగా, మిర్యాలగూడ మునిసిపల్ చైర్మన్, 13మంది కౌన్సిలర్లు, మరో ఇద్దరు మాజీ మునిసిపల్ చైర్మన్లు, మరికొందరు నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. అక్కడ స్థానికనేతలతో సర్దుబాట జరిగితే వారి చేరిక ప్రక్రియ పూర్తికానుంది. గుత్తావర్గానికే చెందిన జడ్పీ వైస్‌చైర్మన్, మరికొందరు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మాజీ సర్పంచులు సైతం త్వరలో కాంగ్రెస్ కండువాలు కప్పుకుంటారని సుఖేందర్‌రెడ్డి వర్గీయులు పేర్కొంటున్నారు.

గుత్తా ఇంటికి కాంగ్రెస్ ముఖ్యులు

లోక్‌సభ ఎన్నికల ముంగిట ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు అమిత్‌రెడ్డి, సోదరుడు మదర్‌డెయిరీ మాజీ చైర్మన్ జితేందర్‌రెడ్డి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. సీఎం, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వారికి స్వయంగా కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. అంతకుముందు ఉదయం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పీసీసీ ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షితో కలిసి హైదరాబాద్‌లో గుత్తా నివాసానికివెళ్లి పార్టీలో చేరాల్సిందిగా అమిత్‌ని, జితేందర్‌ని ఆహ్వానించారు. గుత్తా కుటుంబీకులు కాంగ్రెస్‌లో చేరే అంశంపై గతంలోనే మంత్రి కోమటిరెడ్డితో, సీఎం సలహాదారు నరేందర్‌రెడ్డితో చర్చలు జరిగిన విషయం తెలిసిందే.

పౌల్ట్రీ ధమాల్





పౌల్ట్రీ పరిశ్రమ నష్టాల్లో కొట్టుమిట్టాడుతోంది. పెట్టుబడికి తగిన గిట్టుబాటు ధర రాక నిర్వాహకులు రోజువారీగా లక్షల్లో నష్టాలను భరిస్తున్నారు. ఒక్కో గుడ్డుకు కనీసంగా రూ.1.60 పైగా నష్టం వస్తుండటంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో రోజుకు రూ.81 లక్షల మేర నష్టం వాటిల్లుతోంది. సుమారు 50 పౌల్ట్రీ పరిశ్రమలుండగా నెలకు రూ.24 కోట్ల మేర నష్టాలు వస్తున్నాయి. ఏడాదిలో మూడు నెలలు మాత్రమే డిమాండ్ ఉంటుండగా, మిగతా తొమ్మిది నెలల కాలంలో సుమారు జిల్లాలో రూ.218 కోట్లకు పైగానష్టాన్ని చవిచూస్తున్నారు. ప్రోత్సాహకాలు అందిస్తే పౌల్ట్రీ పరిశ్రమ మనుగడ సాధిస్తుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

- కోదాడ


» నిత్యం రూ.81 లక్షలు.. నెలకు రూ.24 కోట్ల నష్టం
» ఉమ్మడి జిల్లాలో 50 ఫారాలు, 50 లక్షల కోళ్ల పెంపకం
» రోజూ 50 లక్షల గుడ్లు ఉత్పత్తి
» గుడ్డు ఉత్పత్తికి రూ.4.62 పైసలు, వచ్చే ధర రూ.3
» ఇతర రాష్ట్రాల్లో పౌల్ట్రీ పరిశ్రమకు ప్రోత్సాహకాలు

ప్రత్యక్షంగా కూలీలకు, పరోక్షంగా రైతులకు, రవాణా రంగానికి ఊతంగా నిలుస్తున్న పౌల్ట్రీ పరిశ్రమ ఉత్పత్తి చేసిన గుడ్డుకు మద్దతు ధర లేక ఊగిసలాడుతోంది. అక్టోబరు, నవంబరు, డిసెంబరు మూడు నెలలు ఆశాజనకంగా ఉం టే, మిగతా తొమ్మిది నెలలు పెట్టుబడికి, వచ్చే రాబడికి పొంతనలేక నష్టాలను చవిచూడాల్సి వస్తోందని పౌల్ట్రీ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు రాష్ట్రం నుంచి పశ్చిమబంగాల్, అస్సాం, బీహార్, కర్ణాటక, పంజాబ్, మహారాష్ట్రలోని నాగపూర్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు గుడ్లు రవాణా జరిగేవి. దీంతో పరిశ్రమ ఆశాజనకంగా ఉండేది. అది గమనించిన ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సొంత రాష్ట్రాల్లో పౌల్ట్రీ పరిశ్రమలను ప్రోత్సహించాయి. అందులో భాగంగా పౌల్ట్రీ రంగంలోకి వచ్చే ఔత్సాహిక పెట్టుబడుదారులకు సబ్సిడీపై విద్యుత్, రుణాల్లో రాయితీ ఇవ్వడంతో ఆయా రాష్ట్రాల్లో పౌల్ట్రీ పరిశ్రమలు భారీఎత్తున ఏర్పాటయ్యాయి. దీంతో ఆయా రాష్ట్రాల్లో గుడ్డు ఉత్పత్తికి అయ్యే ఖర్చు తక్కువ ఉంటోంది. దీంతో తెలంగాణ, ఏపీ నుంచి వచ్చే గుడ్ల ధర అధికంగా ఉండటంతో అక్కడ వ్యాపారులు గుడ్లు కొనుగోలు చేసేందుకు సుముఖత చూపటంలేదు. దీంతో తెలుగు రాష్ట్రాల్లో గుడ్ల సప్లయి అధికంగా ఉండటం, డిమాండ్ లేకపోవటంతో తక్కువ ధరకు గుడ్డుని విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో మద్దతు ధర అందక రైతులు గుడ్లు తేలేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో వ్యవసాయం తర్వాత పెద్ద పరిశ్రమగా కోళ్ల పరిశ్రమ కొనసాగుతోంది. జిల్లాలో చిన్నా, పెద్దవి కలిపి సుమారు 50 పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో ప్రత్యక్షంగా 20వేల మంది, పరోక్షంగా మరో 30వేల మంది ఉపాధి పొందుతున్నారు. కోళ్ల ఫారాల్లో దాదాపు 50 లక్షల కోళ్లను పెంచుతుండగా, రోజుకు 50 లక్షల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఇదిలా ఉండగా గుడ్లపై చేస్తున్న ఖర్చు రోజుకు రూ.2.31 కోట్లు ఖర్చు చేస్తుండగా, కేవలం రూ.1.50 కోట్ల ఆదాయం వస్తోంది. ఖర్చుకు తగ్గట్టు ఆదాయం లేకపోవడంతో పరిశ్రమ రోజూ రూ.81 లక్షల మేర నష్టాన్ని భరించాల్సి వస్తోంది. ఇలా నెలకు సుమారు రూ.24.30 కోట్ల నష్టాన్ని చవిచూడాల్సివస్తోంది. ఇదిలా ఉంటే సీజన్లుగా వచ్చే వ్యాధులతో కోళ్లు చనిపోతుండటంతో మరింత నష్టాన్ని భరించాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. దీంతో పరిశ్రమ నిర్వహణ భారంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పౌల్ట్రీఫాంలపై ప్రత్యేక దృష్టి సారించి నష్టాలను అధిగమించేలా, పరిశ్రమ మనుగడ కోసం సబ్సిడీతో ఆటు ముడిసరుకు(మొక్కజొన్నలు, సోయాబీన్స్, చీర్‌తో పాటు ఇతరత్రా దాణా)లను తక్కువ ధరలకు అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 50 లక్షల గుడ్లు ఉత్పత్తి అవుతుండగా, నిత్యం రూ.81 లక్షలు, నెలకు రూ.24.30 కోట్ల నష్టం వాటిల్లుతోంది. తొమ్మిది నెలలకు రూ.218.70 కోట్లు నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు. ఈ వేసవిలోనైనా ధరలు ఆశాజనకంగా లేకపోతే పరిశ్రమలను మూసివేయాల్సి వస్తుందంటున్నారు. పరిశ్రమలు మూతపడకముందే ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఒక్కో గుడ్డుపై ఖర్చు-రాబడి	(రూపాయల్లో)
జీరో నుంచి 5 నెలలు(150) ఒక్కో కోడిపిల్ల పెంపకానికి ఖర్చు	రూ.1.00
గుడ్డు దశ(6వ నెల) నుంచి ఒక్కో కోడికి (మొక్కజొన్న, సోయాబీన్, చీర్‌కు దాణాకు)రోజుకు ఖర్చు	రూ.3.00
కరెంటు ఖర్చు ఒక్కొక్క పిల్లపై	రూ.0.22
బ్యాంకు నుంచి తెచ్చిన రుణాలపై ఒక్కొక్క పిల్లపై భారం	రూ.0.40
మొత్తంగా ఒక్కొక్క పిల్లపై వస్తున్న ఖర్చు	రూ.4.62
ప్రస్తుత హోల్‌సేల్‌లో మార్కెట్‌లో ఒక్కో గుడ్డు ధర	రూ.3
ఆ చొప్పున ఒక్కో గుడ్డుపై రోజుకు నష్టం	రూ.1.62

రోజూ నష్టాలే



ఒక్కో గుడ్డుపై రోజు వారీగా రూ.1.62 నష్టం వస్తోంది. సీజన్ వ్యాధులతో కోళ్లు చనిపోవడం అదనపు భారం. ఒక్కో కోడి గుడ్డు దశకు వచ్చినప్పటి నుంచి 26 గంటలకు ఒకటి చొప్పున 350 నుంచి 400 వరకు గుడ్లు పెడుతుంది. రెండోసారి గుడ్డుకు వచ్చే టప్పటికీ 30 గంటలకు ఒక గుడ్డు పెడుతుంది. అప్పుడు 300 గుడ్లుమాత్రమే పెడుతుంది. ఈ నేపథ్యంలో రోజుకు రూ.3 విలువ గల దాణా పెట్టాలి. లేదంటే గుడ్డు పెట్టదు. ఒక్కో గుడ్డుపై ఖర్చు రూ.4.62 వస్తుంది. హోల్‌సేల్ మార్కెట్‌లో గుడ్డు ధర రూ.3 మాత్రమే ఉంది. దీంతో రోజూ నష్టం వాటిల్లుతోంది. రెండుసార్లు గుడ్డు పెట్టిన తర్వాత కోడిని రూ.90కి విక్రయిస్తాం. ఓపెన్ మార్కెట్‌లో గుడ్డుకు రూ.5 మద్దతు ధర లభిస్తే ఇబ్బందులు ఉండవు.

- హరిబాబు,పౌల్ట్రీ ఫాం అసోసియేషన్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు

పరీక్షల్లో తప్పితే ఆందోళనకు గురికావొద్దు: డీఎంహెచ్‌వో

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 29 : పరీక్షల్లో తప్పితే విద్యార్థులు ఆందోళనకు గురికావద్దని డీఎంహెచ్‌వో పాపారావు సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించే మార్గం ఉందన్నారు. అధైర్యపడకుండా ఆత్మస్థైర్యం, ఏకాగ్రతతో పరీక్షలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఒత్తిడి ఉంటే మానసిక వైద్యురాలు ప్రీతి స్వరూప్ జిల్లా ఆసుపత్రిలో అందుబాటులో ఉంటారని లేదా టోల్ ఫ్రీ నెంబరు 14416ను సంప్రదించాలన్నారు. ఫెయిల్ అయిన పిల్లలను ఒంటరిగా వదిలి పెట్టొద్దని, బంధుమిత్రులతో కలిసి ఉండేలా చూడాలని తల్లిదండ్రులకు సూచనలు చేశారు.



పాపారావు, డీఎంహెచ్‌వో

రైస్‌మిల్లు నుంచి నమూనాల సేకరణ

భువనగిరిరూరల్, ఏప్రిల్ 29 : భువనగిరి పట్టణ శివారులోని శివ రైస్‌మిల్లులో పౌరసరఫరాల శాఖ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు.మండలంలోని బొల్లేపల్లి, మోటకొండురులో కొనుగోలు కేం ద్రాల నుంచి ధాన్యాన్ని ఈ రైస్‌మిల్లుకు తరలించారు.అయితే ఏ-గ్రేడ్‌గా ధ్రువీకరించిన ధాన్యాన్ని బీ-గ్రేడ్‌గా నమోదు కావడంతో రైతులు అదనపు కలెక్టర్ బెన్‌షోలూమ్‌కు ఫిర్యాదుచేశారు.ఆయన ఆదేశాల మేరకు శివ రైస్ మిల్లులో దిగుమతి అయిన ధాన్యాన్ని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ గోపీ కృష్ణ, డీసీఎస్‌వో శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించి ధాన్యం నమూనాలను సేకరించారు. ల్యాబ్‌లో పరిశీలించిన అనంతరం గ్రేడ్ నాణ్యతను ధ్రువీకరిస్తామని తెలిపారు.



రైస్‌మిల్లు నుంచి నమూనా ధాన్యాన్ని తీసుకువస్తున్న అధికారులు

జాతీయ అండర్- 14 టెన్నిస్ సిరీస్ ప్రారంభం

» పోటీలకు వివిధ రాష్ట్రాలకు చెందిన 143 మంది బాల,బాలికలు » తొలిరోజు ఉత్సాహంగా సాగిన పోటీలు

భువనగిరి టౌన్, ఏప్రిల్ 29 : జాతీయ అండర్-14 టెన్నిస్ సిరీస్ సోమవారం భువనగిరిలో ఘనంగా ప్రారంభమైంది. ఆరు రోజుల పాటు సాగనున్న సిరీస్‌లో తెలుగు రాష్ట్రాలతో పాటు ఢిల్లీ, గుజరాత్, తమిళనా డు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిషా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 143 మంది బాల, బాలికలు పాల్గొంటున్నారు. తొలి రోజు సోమవా రం సింథటిక్ కోర్టుల్లో జరిగిన పోటీల్లో గెలుపు కోసం క్రీడాకారులు శ్రమించారు. భువనగిరి టెన్నిస్ అకాడమీ, తెలంగాణ రాష్ట్ర టెన్నిస్ అకాడమీ పర్యవేక్షణలో న్యూడైమెన్షన్ టెన్నిస్ అకాడమీ సహకారంతో సిరీస్‌లో తొలి రోజు పోటీలు ఉత్సాహంగా సాగాయి. భువనగిరి టెన్నిస్ అకాడమీ అధ్యక్షుడు సద్ది వెంకట్‌రెడ్డి టెన్నిస్ సిరీస్‌ను ప్రారంభించి, మాట్లాడుతూ ఇక నుంచి క్రమం తప్పకుండా భువనగిరిలో టెన్నిస్ సిరీస్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అకాడమీ కార్యదర్శి ఖలీల్, ఉపాధ్యక్షులు దిడ్డి బాలాజీ సహాయ కార్యదర్శి పరమేశ్వర్‌కుమార్‌సింగ్, ఎవరెస్టర్, పడమటి అన్విత, వినోద్, పాండురంగం పాల్గొన్నారు.



సాగర్ ప్రాజెక్టు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి

నాగార్జునసాగర్, ఏప్రిల్ 29: నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్లతో పాటు, ప్రాజెక్టుపై రోడ్డు నిర్మాణ పనులు పూర్తయినట్లు జేఈ కృష్ణయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుడికాల్వ హెడ్ రెగ్యులేటర్ 9వ గేటు, ఎడమకాల్వ హెడ్ రెగ్యులేటర్ 3 గేటుతో పాటు ప్రాజెక్టుపై రోడ్డు నిర్మాణ పనులకు గతేడాది రూ. 9కోట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. గతంలో ప్రారంభించిన కుడి, ఎడమ కాల్వల గేట్లపై తొలగించిన రోడ్డు నిర్మాణ పనులు ఏపీ, తెలంగాణ మధ్య నీటి వివాదంతో నిలిచిపోయింది. ఈ పనులపై అధికారులు కేఆర్ఎంబీకి లేఖలు రాశారు. దీంతో కేఆర్ఎంబీ సభ్యులతో పాటు, ఎన్‌డీఎస్‌ఏ బృందం కూడా సందర్శించింది. నిలిచిపోయిన మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్నెస్పీ అధికారులకు సూచించారు. దీంతో ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించిన రోడ్డు నిర్మాణ పనులు మూడు రోజుల క్రితం పూర్తయినట్లు జేఈ తెలిపారు. ఈ ఏడాది వానాకాలం ప్రారంభమయ్యే నాటికి (జూన్ రెండో వారం నాటికి) సాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల సర్వీసింగ్ పనులను పూర్తి చేస్తామని ఏఈ తెలిపారు. క్రస్ట్ గేట్ల రూప్‌లకు గ్రీసింగ్, రబ్బరు సీళ్ల చెకింగ్ వంటి పనులు జూన్ మొదటి వారంలో ప్రారంభించి రెండోవారం నాటికి పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

కమ్యూనిస్టులతో ఏళ్లనాటి అనుబంధం


మాట్లాడుతున్న సీఎల్పీ మాజీ నాయకుడు కుందూరు జానారెడ్డి

మిర్యాలగూడ, ఏప్రిల్ 29: కమ్యూనిస్టులతో తనది ఏళ్ల నాటి అనుబంధమని సీఎల్పీ మాజీ నాయకుడు కుందూరు జానారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో సోమవారం జరిగిన నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి బలపరుస్తూ ఏర్పాటు చేసిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు తనకు మద్దతు పలికిన మొదటి అభ్యర్థిని తానేనని అన్నారు. పలుమార్లు పొత్తుల్లో భాగంగా సీపీఎం నాయకుల విజయం కోసం కృషి చేశానన్నారు. తిరిగి ఇండియా కూటమిలో సీపీఐ, సీపీఎం బలపరుస్తున్న మొదటి అభ్యర్థి రఘువీర్‌రెడ్డి కావడం సంతోషకరమన్నారు. ప్రధాని మోదీ రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలు నేరవేర్చక పోగా వంద రోజులకే కుసంస్కారంతో కాంగ్రెస్‌ను విమర్శిస్తోందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ఇండియా కూటమిలో భాగంగా రాష్ట్రంలో 16స్థానాల్లో కాంగెస్ అభ్యర్థులను సీపీఎం బలపరుస్తోందన్నారు. మూడోసారీ మోదీకి అవకాశం ఇవ్వకూడదన్నారు. జానారెడ్డి సీఎం అవుతారని అనుకున్నారని, అది ఇప్పటి వరకు నెరవేరలేదని, ఇక ముందు నెరవేరవచ్చునేమో చెప్పలేమన్నారు. ఎమ్మెల్యే బీఎల్ఆర్ మాట్లాడుతూ తన తాత సీపీఎం నాయకుడేనన్నారు. ఆయన వారసత్వం నుంచే సేవాకార్యక్రమాలు నిర్వహించానన్నారు. రఘువీర్‌ను ఎంపీగా గెలిపిస్తే రాష్ట్ర నిధులతోపాటు నియోజకవర్గానికి కేంద్ర నిధులు తెచ్చి అభివృద్ధికి బాటలు వేయొచ్చన్నారు. ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ వ్యవస్థలను గుపెట్లో పెట్టుకుని నియంతలా వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మల్లు నాగార్జునరెడ్డి, మల్లు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కులం, మతం పేరు చెప్పే వారికి ఓటేయొద్దు


మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి, పక్కన కిరణ్‌కుమార్‌రెడ్డి

శాలిగౌరారం, ఏప్రిల్ 29: కుల, మతం కోసం పాకులాడే బీజేపీకి ఓటు వేస్తే దేశం వినాశనం అవుతుందని, పేద ప్రజల కోసం నిరంతరం అభివృద్ధి పడే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని మునుగోడు ఎమ్మెల్యే, భువనగిరి పార్లమెంటు ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రంలో సోమవారం రాత్రి కాంగ్రెస్ ప్రచార సభ జరిగింది. బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య చీలిక తెచ్చేలా వ్యవహరిస్తుందన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశానికి చేసింది ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నేరవేర్చేందుకు ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా చిత్తశుద్ధితో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తామన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ కిరణ్‌కుమార్‌రెడ్డిని తన కంటే ఎక్కువ మెజార్టీతో గెలిపించాలని కోరారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే సమస్యలను ఢిల్లీలో వినిపిస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కైలాస్ నేత, అన్నెబోయిన సుధాకర్, కందాల సమరంరెడ్డి, పాదూరి శంకర్‌రెడ్డి, నూకల కిరణ్‌కుమార్‌యాదవ్, ఎర్ర చైతన్య, చామల మహేందర్‌రెడ్డి, షేక్ ఇంతియాజ్, కట్టంగూరు సురేందర్‌రెడ్డి, చింత ధనుంజయ, పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి,: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీ అవినీతికి పాల్పడిన కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను జైలుకు పంపిస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ తన పదేళ్ల అధికారంలో తిన్న అవినీతి సొమ్మంతా కక్కిస్తామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ సోమవారం రాత్రి నార్కట్‌పల్లిలో భారీ ర్యాలీ రోడ్‌షోలో ఉద్దేశించి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో కారు కార్ఖానాకు, సారు దవాఖానాకు పోయారని, బీఆర్ఎస్ పార్టీ చచ్చిపోయిందని ఎద్దేవా చేశారు. ఐనా తగుదునమ్మా అంటూ ప్రజల కోసమేనంటూ బస్సు యాత్ర చేస్తున్న కేసీఆర్ ముందు లిక్కర్ స్కాం కేసులో జైలుపక్షిలా మారిన కూతురు కవిత బాగోగులు చూసుకోవాలన్నారు. తెలంగాణా రాష్ట్రం కోసం కేంద్రంలో సొంత పార్టీపైనే పోరాటం చేసిన చరిత్ర కోమటిరెడ్డి సోదరులదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కోమటిరెడ్డి సోదరులను కాదని ఏమీ జరగదన్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, నేతి విద్యాసాగర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, బండ సాగర్‌రెడ్డి, అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి, పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి, వడ్డే భూపాల్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, జెరిపోతుల భరత్, నేతకాని కృష్ణయ్య, రేగట్టె నర్సిరెడ్డి, నవీన్‌రెడ్డి, వారాల రమేశ్ పాల్గొన్నారు.

నల్లగొండ, భువనగిరి బరిలో 61 మంది

నల్లగొండ బరిలో 22మంది

రఘువీర్ కుందూరు(కాంగ్రెస్)
కంచర్ల కృష్ణారెడ్డి(బీఆర్ఎస్)
సైదిరెడ్డి శానంపూడి(బీజేపీ)
అంజయ్య విరిగినేని (బీఎస్పీ)
నందిపాటి జానయ్య (తెలంగాణ సకల జనుల పార్టీ)
తలారి రాంబాబు (ధర్మసమాజ్ పార్టీ)
రచ్చ సుభద్రారెడ్డి(సోషలిస్టు పార్టీ ఇండియా)
వస్కుల మట్టయ్య(మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా, యునైటెడ్)
కిన్నెర యాదయ్య (స్వతంత్ర)
కుందారపు శ్రీకాంత్(స్వతంత్ర)
కుక్కల వెంకన్న(స్వతంత్ర)
గోలి సైదులు(స్వతంత్ర)
చొల్లేటి ప్రభాకర్(స్వతంత్ర)
పానుగోతు లాల్‌సింగ్(స్వతంత్ర)
పాలిశెట్టి వెంకటేశ్వర్లు (స్వతంత్ర)
బండారు నాగరాజు (స్వతంత్ర)
మర్రి నెహేమ్యా(స్వతంత్ర)
మారం వెంకట్‌రెడి.(స్వతంత్ర)
రమేష్ సుంకరి(స్వతంత్ర)
రవి పాలకూరి(స్వతంత్ర)
లింగం కృష్ణ(స్వతంత్ర)
సిరిశాల శ్రీనయ్య(స్వతంత్ర)

భువనగిరి బరిలో 39మంది

చామల కిరణ్‌కుమార్‌రెడ్డి(కాంగ్రెస్)
డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ (బీజేపీ)
క్యామ మల్లేష్(బీఆర్ఎస్)
ఎండీ. జహంగీర్(సీపీఎం)
అయిత రాజు అంబేద్కర్ (బీఎస్పీ)
అమీర్‌రెడ్డి రవికిరణ్‌రెడ్డి(స్వతంత్ర)
గడేపాక అనిల్‌కుమార్ (స్వతంత్ర)
భాషబోయిన లక్ష్మయ్య(స్వతంత్ర)
బొల్లారం బాల్‌రాజు (స్వతంత్ర)
బూసిపాక వెంకటయ్య (స్వతంత్ర)
దీరావత్ గోపినాయక్(స్వతంత్ర)
ఎర్ర సూర్యం(విదుతలై చిరుతైగల్ కట్చి)
పులిపాక సూజత(స్వతంత్ర)
కదిరే కిరణ్‌కుమార్ (బహుజన రిపబ్లికన్ సోషలిస్టు పార్టీ)
కందాడి మహిపాల్‌రెడ్డి (తెలంగాణ రిపబ్లికన్‌పార్టీ)
కందే రామరాజు(స్వతంత్ర)
కారింగుల యాదగిరి (స్వతంత్ర)
కరుణాకర్‌రెడ్డి నల్ల (జైభారత్ నేషనల్ పార్టీ)
కొంగరి లింగస్వామి (ధర్మసమాజ్ పార్టీ)
కొంగరి మల్లయ్య (స్వతంత్ర)
శ్రీనివాస్(నేషనల్ మహాసభ పార్టీ)
మల్లెబోయిన పరమేష్(స్వతంత్ర)
మేగావత్ చందు (స్వతంత్ర)
మోరిగాడి కృష్ణ(స్వతంత్ర)
ముసునూరి గణేస్ (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా)
నరేందర్ బేతి(స్వతంత్ర)
నరేంద్ర వేముల (జైస్వరాజ్‌పార్టీ)
నర్రి స్వామి కుర్మ(స్వతంత్ర)
నూనె వెంకటస్వామి (బహుజన లెఫ్ట్‌పార్టీ)
పెంట రమేష్(బహుజన ముక్తి పార్టీ)
శ్రీనివాస్ (తెలంగాణ రాష్ట్ర పునర్‌నిర్మాణ సమితి)
బిక్షపతి (నేషనల్ నవ క్రాంతిపార్టీ)
సుదర్శన్‌రెడ్డి (సోషల్ పార్టీ ఇండియా)
రమేష్ తాలేపల్లి(అలియెన్స్ ఆఫ్ డెమోక్రాటిక్ రిఫోర్మ్స్ పార్టీ)
సదానందరెడ్డి వింద్యాల (పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ)
తరిగొప్పుల మహేందర్(సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా)
ఉదరి మల్లేష్ (స్వతంత్ర),
వరికుప్పల కృష్ణ(స్వతంత్ర)
వెంకటేశ్వర్లు లింగిడి (ప్రజావాణి పార్టీ)

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : జగదీష్‌రెడ్డి


డిండి : రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీమంత్రి జగదీష్‌రెడ్డి

డిండి, ఏప్రిల్ 29: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయని చేతగాని దద్దమ్మ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విమర్శించారు. నల్లగొండ జిల్లా డిండి మండలకేంద్రంలో సోమవారం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. రైతుల ఇబ్బందులు తెలుసుకొని వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే 200మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకోవాలన్నారు. ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. కల్యాణలక్ష్మి రూ.లక్ష 116తోపాటు తులం బంగారం, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, విద్యార్థినులకు స్కూటీలు, రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలన్నారు. కేసీఆర్‌ని జైలులో వేయడం నీ అయ్యతరం కాదన్నారు. మోయలేని హామీలు ఇచ్చి అమలుచేయలేక రాష్ట్ర ప్రభుత్వం చతికిలపడిందన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో నల్లగొండ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, నాయకులు రాజినేని వెంకటేశ్వరరావు, బిల్యానాయక్, వడ్త్య రమేష్‌నాయక్, రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, ఎంపీపీ మాధవరం సునితజనార్ధన్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరావు, గిరమోని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చందంపేట: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లో సోమవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. నల్లగొండ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి తనను గెలిపిస్తే ఆరు గ్యారెంటీల అమలుపై పోరాటం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, నాయకులు ఏడుపుల గోవిందు, యాసాని రాజవర్ధన్‌రెడ్డి, గోసుల శివ, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, మోహన్‌కృష్ణ, తిరుపతయ్య, ఆరేకంటి రాములు పాల్గొన్నారు.

దాతల పేరిట గుప్తనిధుల వేట


గుప్త నిధుల తవ్వకాలు కోసం నిందితులు తీసుకొచ్చిన సామగ్రి

నాగారం, ఏప్రిల్ 29: ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని ఓ వ్యక్తి ఆరు నెలల క్రితం వచ్చాడు. ఆలయంలో బోరు వేయించాడు. పైప్‌లైను నిర్మాణం ముసుగులో గర్భగుడిలో గుప్త నిధుల కోసం తవ్వకాలకు 12మంది వచ్చారు. గ్రామస్థులు అనుమానించి ఈ 12మందిలో ఎనిమిది మందిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగి రి గ్రామంలో గుట్టపై ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం జరిగింది. గ్రామస్థులు, నాగారం ఎస్ఐ పి.వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన రమణారెడ్డి, ఫణిగిరిలో సీతారామ చంద్రస్వామి ఆలయానికి ఆరు నెలల కిత్రం వచ్చాడు. ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పి ఆలయ ప్రాంగణంలో మంచినీటి బోరు వేయించారు. తరుచుగా ఆలయానికి వచ్చి గుప్తనిధుల కోసం వెదికాడు. ఆలయంలో మంచినీటి పైపులైను వేస్తామని సోమవారం ఉదయం 10గంటలకు ఒక వాహనం, ఒక స్కూటీపై మొత్తం 12మంది వచ్చారు. గర్భగుడిలో తవ్వకాలు ప్రారంభించారు. వీరిపై అనుమానంతో పూజారి సంతోష్‌శర్మ గ్రామస్థులకు సమా చారం ఇచ్చారు. గ్రామస్థులు ఆలయాన్ని చుట్టుముట్టి ఈ 12మందిలో రమణారెడ్డితో పాటు మరో ఏడుగురిని పట్టుకున్నారు. వారి నుంచి గుప్త నిధుల అన్వేషణ కోసం తెచ్చిన స్కానర్లు, టూల్ కిట్స్ డ్రిల్లింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితులపై గతంలో కూడా గుప్త నిధుల తవ్వకాలు కేసులు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక ఆందోళనతో వృద్ధురాలు ఆత్మహత్య


పుల్లమ్మ మృతదేహం

వేములపల్లి, ఏప్రిల్ 29: మానసిక ఆందోళనకు గురై వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని బుగ్గబావిగూడెంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రేఖా పుల్లమ్మ(75)కు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారులకు వివాహాలు కాగా వేరే కాపురాలు ఉంటూ పుల్లమ్మకు ఒక గది ఏర్పాటు చేశారు. ఆమె అందులో ఒంటరిగా జీవనం సాగిస్తుంది. కొద్ది రోజులుగా తన మంచి చెడులను కుమారులు పట్టించుకోడం లేదంటూ మానసిక ఆందోళన గురై తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ పలుమార్లు బెదిరిస్తుండగా కూతురు గంగమ్మ, కుమారులు సర్దిచెబుతూ వస్తున్నారు. ఆదివారం రాత్రి ఒంటరిగా ఉన్న సమయంలో తన గదిలో చీరెతో ఉరి వేసుకుంది. కొంత సేపటి తర్వాత రెండో కుమారుడు వెంకన్న ఇంట్లోకి వెళ్లి చూడగా గదిలోని కర్రకు ఉరి వేసుకొని కన్పించడంతో చుట్టుపక్కల వారికి సమాచారం అందించగా పుల్లమ్మను కిందికి దించారు. అప్పటికే ఆమె మృతిచెందింది. తన తల్లి మానసిక ఆందోళనతోనే ఆత్మహత్యకు పాల్పడిందని, మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని సోమవారం ఉదయం పుల్లమ్మ చిన్న కూతురు గంగమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసుకున్నారు. మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలు



సీనియర్ విభాగంలో తలపడుతున్న గిత్తలు

మఠంపల్లి, ఏప్రిల్ 29: మఠంపల్లి శుభవార్త దేవాలయ మహోత్సవాలను పురస్కరించుకొని శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రాష్ట్రాలస్థాయి ఎడ్ల పందేలు నాలుగో రోజు సోమవారం సీనియర్ విభాగ పోటీలు హోరహోరీగా జరిగాయి. నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, వరంగల్, కృష్ణా, పల్నాడు, ప్రకాశం, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లా నుంచి 10జతల గిత్తలు తరలివచ్చి పోటీల్లో పాల్గొన్నాయి. ఎండతీవ్రత దృష్టిలో ఉంచుకొని సాయంత్రం 6గంటల నుంచి అర్ధరాత్రి వరకు పోటీలు జరుగుతున్నాయని యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభరత్‌రెడ్డి తెలిపారు. సోమవారం జరిగిన సీనియర్ విభాగంలో మొత్తం 10జతలు పాల్గొనట్లు నిర్వాహకులు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తాగునీరు, వసతి, భోజన సదుపాయలను కమిటీ సభ్యులు కల్పిస్తున్నారు. మఠంపల్లి మండలకేంద్రంలో పండుగ వాతవరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఫాదర్ వినోద్‌రెడ్డి, ఆధూరి కిషోర్‌రెడ్డి, మధుసుధన్‌రెడ్డి, శౌరెడ్డి, జడ్డు జల బాల్‌రెడ్డి, కె.చిన్నపురెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాలశౌరెడ్డి, గాదె పవన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

విజేతలు వీరే...

ప్రకాశం జిల్లా, నాగులపాడుకు చెందిన పుచ్చకాయల శేషాద్రిచౌదరి గిత్తలు 5400 అడుగులు లాగి మొదటి బహుమతి కైవసం చేసుకుంది. రెండో బహుమతి తెలంగాణ రాష్ట్రం, హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేందర్‌రెడ్డి(ఏఎస్పీ) గిత్తలు 5,100అడుగులు, మూడో బహుమతి కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, పెదపులిపాకకు చెందిన డి.రాహన్‌బాబు, గరికపాటి శ్రీధర్‌కు చెందిన గిత్తలు సంయుక్తంగా 5,090 అడుగులు లాగి, తెలంగాణ రాష్ట్రం, హైదరాబాదుకు చెందిన మేకా ప్రతిక్ గిత్తలు 4,987 అడుగులు లాగి నాలుగో బహుమతి, ప్రకాశం, కృష్ణా జిల్లాలకు చెందిన పుచ్చకాయల శేషాద్రి, సత్య చౌదరి గిత్తలు సంయుక్తంగా ఐదో బహుమతి, కృష్ణా జిల్లా, హైదరాబాదుకు చెందిన డి.రాహన్‌బాబు, గరికిపాటి శ్రీధర్‌కు చెందిన సంయుక్తంగా బహుమతి, పల్నాడు జిల్లా, మాచవరానికి చెందిన నీలం వెంకటేశ్వర్లు గిత్తలు ఏడో బహుమతి గెలుచుకున్నట్లు యువజన సంఘం అధ్యక్షుడు జయభరత్‌రెడ్డి తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో రూ.6.50లక్షల నగదు స్వాధీనం


కొండమల్లేపల్లిలో నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

రామన్నపేట, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఉమ్మడి జిల్లాలో సరైనా పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ. 6.50లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం వెళ్లే దారిలో స్థానిక పోలీసులలు వాహనాల తనకి చేస్తుండగా బైక్‌పై వెళుతున్న మహేష్ వద్ద రూ.2.50లక్షలు పట్టుబడినట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు. వివరాలు చూపకపోవడంతో నల్లగొండ జిల్లా ట్రెజరీ కార్యాలయంలో జమ చేసినట్లు తెలిపారు.

వలిగొండ: మండలంలోని చిత్తపురం గ్రామానికి చెందిన నరేందర్‌రెడ్డి బైక్‌పై రూ.2.80లక్షలు తరలిస్తుండగా తొర్రూరు క్రాస్ రోడ్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు విచారించారు. సరైన ప్రతాలు చూపనందున నగదును ట్రెజరీ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. అదేవిధంగా వలిగొండలో అక్రమంగా నిల్వచేసిన 16.9 లీటర్ల మద్యన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ సుమారు. రూ.4,225 అక్రమంగా నిల్వ చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలో సోమవారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా శ్రీనివాస్ వద్ద నుంచి రూ.1.20లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో అనుమతికి మించి నగదును తరలిస్తే సీజ్ చేస్తామని అన్నారు. తనిఖీల్లో కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, బాలాజి, సిబ్బంది ఉన్నారు.

సూర్యాపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా అక్రమ డబ్బు, మద్యం, డ్రగ్స్ లాంటి అక్రమ రవాణాను నిరోధించడంలో భాగంగా సూర్యాపేట జిల్లా పోలీసులు అంతర్‌రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దుల్లో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్టంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. సూర్యాపేట మండల పరిధిలోని టేకుమట్ల చెక్‌పోస్టు వద్ద సోమవారం డ్రగ్స్ నివారణలో భాగంగా నార్కోటిక్ డాగ్ రోలెక్స్‌తో వాహనాలు తనిఖీ చేశారు. ఈ రోలెక్స్ డాగ్ నార్కోటిక్ డ్రగ్స్‌ను గుర్తించడంలో నైపుణ్యం కలిగిన డాగ్ అని పోలీసులు తెలిపారు.

గంజాయి మత్తులో వివాహితపై లైంగిక దాడి

చౌటుప్పల్ రూరల్ ఏప్రిల్ 29: గంజాయి మత్తులో ఓ వివాహితపై యువకుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎస్‌లింగోటం గ్రామంలో ఈ సంఘటన జరిగింది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రానికి చెందిన భార్యాభర్తలు ఎస్‌లింగోటం గ్రామంలోని ఓ పరిశ్రమలో కొంతకాలంగా పనిచేస్తూ గ్రామ శివారులోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. భర్త ఆదివారం సాయంత్రం డ్యూటీకి వెళ్లగా, వివాహిత(20) ఒంటరిగా ఉంది. ఆదివారం రాత్రి ఏడు గంటల సమయంలో ఆమె ఇంటి వద్ద కూర్చుని సెల్‌ఫోన్ చూస్తుంది. ఆ సయయంలో ఎస్ లింగోటం గ్రామానికి చెందిన జులాయిగా తిరిగే తూర్పుంటి విష్ణు(22) వివాహితను బెదిరించి సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి ఎత్తుకెళ్లి ఆమెపై లైంగికంగా దాడి చేశాడు. దుండగుడి నుంచి తప్పించుకున్న ఆమె ఇంటికి వచ్చి డయల్ 100 నెంబర్‌కు కాల్ చేసింది. వెంటనే పోలీసులు గ్రామానికి చేరుకొని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి మత్తులో యువకుడు లైంగికదాడికి పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

26 లీటర్ల సారా, 850 కిలోల పటిక స్వాధీనం

హుజూర్‌నగర్, ఏప్రిల్ 29: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పరిధిలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మఠంపల్లి మండలం పీక్లానాయక్‌తండాకు చెందిన లావుడ్యా బుజ్జి ట్రాక్టర్‌లో ఐదు బస్తాల పటికను కొత్తతండాకు సరఫరా చేస్తుండగా ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. కొత్తతండాలో బాణోత్ యలమంద 100కిలోల పటిక తరలిస్తుండగా వాహనం సీజ్ చేశారు. చింతలపాలెం మండలంలో బూదవాడకు చెందిన గుగులోత్ రమేష్ వాహనం తరలిస్తుండగా సీజ్‌చేస్తున్నట్లు తెలిపారు. బెట్టెతండాలో అశోక్ అనే వ్యక్తి 10 లీటర్ల సారా తరలిస్తుండగా వాహనం, సారా స్వాధీనం చేసుకున్నారు. దొనబండతండాకు చెందిన మాళోత్ సైదా ఆరు లీటర్ల సారా తరలిస్తుండగా టీవీఎస్ వాహనం సీజ్ చేశారు. శివబాలాజీతండాకు చెందిన బాణోత్ సైదా 10 లీటర్ల సారా తరలిస్తుండగా బైక్‌ను సీజ్ చేశారు. బెట్టెతండాకు చెందిన అశోక్, గణేష్ ఛత్రు ఆటోలో 250 కిలోల పటికను తరలిస్తుండగా సీజ్ చేశారు. దొండపాడులో 100 కిలోల పటిక స్వాధీనం చేసుకున్నారు. మట్టపల్లిలో ధర్మేంద్ర కారులో మద్యం ఉంచి ఆంధ్రాకు తరలిస్తుండగా 105 సీసాల మద్యాన్ని స్వాధీనం చేసుకుని కారు సీజ్ చేశారు. మొత్తం 26 లీటర్ల సారా, 850కిలోల పటిక, 105 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. 12మందిపై కేసు నమోదు చేసి, తొమ్మిది వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా వివిధ కేసుల్లో 15మందిని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు దివ్య, వెన్నెల, జగన్‌రెడ్డి, గోవర్ధన్ పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

వలిగొండ, ఏప్రిల్ 29: ట్రాక్టర్ బోల్తా పడి గాయపడిన వ్యక్తి సోమవారం మృతి చెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని నాగారం గ్రామానికి చెందిన యాదగిరి (26) భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నాడు. ఆత్మకూరు మండల లింగరాజుపల్లికి భవన నిర్మాణ పనుల నిమిత్తం వెళ్లి తిరిగి వస్తుండగా ర్రూరు గ్రామ పరిధిలో ట్రాక్టర్ బోల్తా పడింది. తీవ్రంగా గాయపడ్డ అతడిని స్థానిక ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 29: కాంగ్రెస్ అమలుచేస్తున్న ఆరు గ్యారంటీలను కార్యకర్తలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. సోమవారం యాదగిరిగుట్ట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో యాదగిరిగుట్ట పట్టణం, ఆలేరు మండలం కొలను పాక గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, ఇతర పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలను విప్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీలో చేరినవారిలో మాజీ ఎంపీపీ శివరాత్రి దానయ్య, శివరాత్రి నరేష్, పెలిమెల్లి శ్రీధర్, సంతోష్, నరేష్, రాము ఉన్నారు.


యాదగిరిగుట్ట రూరల్: పార్టీలోకి కార్యకర్తలను ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి: ఎమ్మెల్యే కుంభం

భువనగిరి టౌన్/ భూదాన్‌పోచంపల్లి: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపును పార్టీ కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం భువనగిరిలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి అధిక మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు, నాయకులు ప్రజా క్షేత్రంలో శ్రమించాలన్నారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, సభ్యుడు తంగెళ్లపల్లి రవికుమార్, పట్టణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కూర వెంకటేష్, చిక్కుల వెంకటేష్, మునిసిపల్ మాజీ చైర్మన్లు బర్రె జహంగీర్, దొనకొండ వనితా రాములు, మాజీ ఎంపీపీ తోటకూరి వెంకటేష్‌యాదవ్, కౌన్సిలర్లు ఈరపాక నర్సింహ, గంగాభవానీ పాల్గొన్నారు.


భువనగిరి : సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌రెడ్డి

● భూదాన్‌పోచంపల్లి మండలంలోని మెహర్‌నగర్‌లో ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాక మల్లేష్‌యాదవ్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు కోట సురేందర్, కళ్లెం సాయిలు, కోట భాస్కర్, కుందారపు మల్లేష్‌యాదవ్, మాజీ సర్పంచు ఆకుల శ్రీలత, పబ్బు రజిత, యంజాల కృష్ణ పాల్గొన్నారు.

మోటకొండూర్: ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్లంల సంజీవ రెడ్డి అన్నారు. చామల కిరణ్ కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ సోమవారం మండలంలోని మాటూరు గ్రామంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి మహేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరబోయిన మల్లేష్‌యాదవ్, వైస్ ఎంపీపీ ఇల్లేందుల మల్లేష్‌గౌడ్, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు బోయిని ఝాన్సీ, మాజీ సర్పంచ్ జెన్నే సిద్ధులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్: మునిసిపాలిటీలోని 16వ వార్డుకు చెందిన శాలివాహన సంఘం అధ్యక్షుడు చిలువేరు కృష్ణ, 12వ వార్డుకు చెందిన కంచరకుంట్ల రామ్ రెడ్డి లు సోమవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి తమ తమ అనుచరులతో మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, ఖలీల్, నర్సింహ ఉన్నారు.

మోదీపై దుష్ప్రచారమే కాంగ్రెస్ మేనిఫెస్టో

● బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి నర్సయ్యగౌడ్

తుర్కపల్లి, ఏప్రిల్ 29: ప్రధాని నరేంద్ర మోదీపై దుష్ప్రచారం చేయడమే కాంగ్రెస్ మేనిఫెస్టో అని బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి 40 ఎంపీ సీట్లు వచ్చే పరిస్థితి లేదని గ్రహించిన కాంగ్రెస్ పార్టీ నేతలు మోదీ గెలిచి మళ్లీ ప్రధాన మంత్రి అయితే రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రద్దు చేస్తుందని, ఒక దుష్ప్రచారానికి తెరలేపిందని, దీన్ని ప్రజలు ఎవరూ నమ్మవద్దన్నారు. గత 10 ఏళ్లుగా 303 ఎంపీ సీట్లతో రెండింట మూడొంతుల మెజార్టీతో మోదీ ప్రధాన మంత్రిగా ఉన్నాడని భారత రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రద్దు చేయాలనుకుంటే అప్పుడే చేసే వారాని, బీజేపీని ఎదుర్కోలేకనే కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తనపై ప్రజలు చూపిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులు తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. బీజేపీలో వర్గ పోరు నడుస్తోందని, నాయకులు సహకరించడంలేదని తనపై అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. తాను కుల రాజకీయాలు చేయడంలేదని, బీసీ బిడ్డను మాత్రమేనన్నారు. పార్టీలో వర్గ విభేదాలు లేవని, తామంతా ఐకమత్యంగానే ఉన్నామని భువనగిరిలో బూర దిల్లీలో మోదీ విజయం ఖాయమని ప్రజలే అంటున్నారని, ఆయన ఈసందర్భంగా తెలిపారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు యాట పెంటయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్కూరి అశోక్, నియోజక వర్గం కన్వీనర్ చిరిగె శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బానోతు చత్రునాయక్, మండల నాయకులు కొక్కొండ లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, నరేందర్‌నాయక్, వెంకటేశం ఉన్నారు.

● రేషన్ షాపుల్లో రేషన్ బియ్యం ఇస్తుంది కేంద్ర ప్రభుత్వమేనని భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మండలంలోని మాధాపూర్, తుర్కపల్లి, వెంకటాపూర్, దత్తాయపల్లి, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో మాట్లాడారు.

యాదగిరిగుట్ట రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం యాదగిరిగుట్ట పట్టణ, మండలంలోని గౌరాయిపల్లి మాసాయిపేట, సైదాపురం గ్రామాలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, రచ్చ శ్రీనివాస్, మండల, పట్టణ అధ్యక్షుడు గుంటిపల్లి సత్యనారాయణ, కర్రె ప్రవీణ్, మధుగౌడ్ ఉన్నారు.


తుర్కపల్లి: ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

రాజాపేట: దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని భువనగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. రాజాపేట మండలంలోని రఘునాథపూర్, బేగంపేట, రేణికుంట, గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నాయకులు రాజు, శేఖర్‌రెడ్డి, వాణి పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ పరిశీలకులు సూచించారు. బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని పర్యవేక్షించేందుకు పార్టీ అధిష్టానం నియమించిన కర్ణాటకకు చెందిన పరిశీలకులు ఉదయ్ కుమార్, దేవయ్య, వికాస్ సోమవారం భువనగిరిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, పార్లమెంట్ ప్రభారి పి.పాపారావు, కన్వీనర్ లింగస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

వలిగొండ: దేశంలో స్వపరిపాలన, అవినీతి రహిత పాలన మోదీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం బాస్కర్ అన్నారు. సోమవారం మండలంలోని నాతాళ్లగూడెంలో ఇంటింటికీ బీజేపీ ఎన్నికల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిఎస్ రెడ్డి, స్టేట్ కౌన్సిల్ నెంబర్ ఎల్లే చంద్రశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు బొళ్ల సుదర్శన్, జిల్లా కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్, రాచకొండ క్రిష్ణ, దంతూరి సత్తయ్య, నాయకులు బచ్చు శ్రీనివాస్, మైసోళ్ల మత్స్యగిరి, కందుల తనీషా, మారోజు అనీల్ కుమార్, లింగస్వామి పాల్గొన్నారు.

నియామకాలు

బీఆర్ఎస్ మోత్కూరు పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాస్



మోత్కూరు, ఏప్రిల్ 29: తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ బీఆర్ఎస్ మోత్కూరు పట్టణ అధ్యక్షుడిగా మాజీ ఎంపీటీసీ జంగ శ్రీనివాస్‌ను నియమించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి కళ్యాణ్‌చక్రవర్తి ఇటీవల పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో సోమవారం మోత్కూరులో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ శ్రీనివాస్‌ను పట్టణ అధ్యక్షుడిగా నియమిస్తున్నట్టు ప్రకటించారు. శ్రీనివాస్ బీఆర్ఎస్ (టీఆర్ఎస్) ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేయడంతో పాటు బీఆర్ఎస్ విద్యార్థి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా, మోత్కూరు సింగిల్ విండో డైరెక్టర్‌గా, ఎంపీటీసీగా పనిచేశారు.

బీఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యాదయ్య

మోటకొండూర్, ఏప్రిల్ 29: బీఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండల కేంద్రానికి చెందిన భూమండ్ల యాదయ్య నియమితులయ్యారు. ఈమేరకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొట్ల యాదయ్యకు సోమవారం పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈఎన్నికకు సహకరించిన నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యాదయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పన్నాల అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ, కో ఆప్షన్ సభ్యుడు ఎండి.బురాన్, అనంతుల జంగారెడ్డి, జీవిలికపల్లి వెంకటేష్, నక్కిర్త ఉప్పలయ్య, మల్గ వెంకటేష్, లోడె యాదగిరి, బొట్ల ప్రశంత్, బాలకృష్ణ పాల్గొన్నారు.

బెల్లి లలిత జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి


బెల్లి లలిత ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మోత్కూరు, ఏప్రిల్ 29: తెలంగాణ మలి దశ ఉద్యమానికి పురుడు పోసిన బహుజన బిడ్డ బెల్లి లలిత జయంతిని రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బెల్లి లలిత జయంతి సందర్భంగా సోమవారం మోత్కూరులో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రానికి చెందిన లలిత ఆనాటి పాలకులకు వ్యతిరేకంగా తన ఆటపాటలతో ప్రజలను చైతన్యం చేసి, తెలంగాణ మలి దశ ఉద్యమానికి ప్రజలను సమాయత్తం చేశారన్నారు. ఆమె విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బెల్లి లలిత కుమారుడు శ్రీరామ్ మురళీ కృష్ణ, కనుకు సతీష్, గాదబోయిన నాగరాజు, పట్వారి భద్రయ్య, మహ్మద్ ఖలీల్, ఎడ్ల భీముడు, బుంగ యాదయ్య, రవి, నర్సింహ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

మోత్కూరు, ఏప్రిల్ 29: బాధిత కుటుంబానికి ఆ గ్రామమంతా బాసటగా నిలిచి, నగదును సాయంగా అందజేసింది. త్కూరు మునిసిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన దేవర శ్రీశైలం ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మృతునికి భార్య మమత, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. మృతునిది నిరుపేద కుటుంబం. మృతుడు కారు డ్రైవరుగా, అతని భార్య ఇళ్లలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ, పిల్లలను చదివించుకుంటున్నారు. కుటుంబ పెద్ద శ్రీశైలం మృతితో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతుండగా గ్రామస్థులు, స్నేహితులు ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు వచ్చారు. రూ.1.03లక్షలను సేకరించారు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, భార్య మమతకు తాము సేకరించిన రూ.1,03,016 అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, బద్దం నాగార్జునరెడ్డి, నల్ల మధు, బద్దం దిలీప్, చేకూరి నాగన్న, నర్సింహ, కన్నెబోయిన పరమేష్ పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేసే వారికి పట్టం కట్టాలి

సంస్థాన్ నారాయణపురం ఏప్రిల్ 29: ప్రజల కోసం పాటుపడే వారికి ప్రజలు పట్టం కట్టాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు కోరారు. సీపీఎం అభ్యర్థి ఎండి.జహంగీర్‌కు మద్దతుగా సోమవారం మండలంలోని పుట్టపాక, గుజ్జా, మల్లారెడ్డిగూడెం, సర్వేల్, అల్లందేవి చెరువు, కోతులాపురం, చిమిర్యాల, కంకణాలగూడెం, నారాయణపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూ ప్రజా పోరాటాల్లో నికరంగా పోరాడుతున్న జహంగీర్ 35సంవత్సరాలుగా ప్రజా జీవితంలో నిఖార్సుగా పని చేస్తున్నారని తెలిపారు. అభ్యర్థి ఎండి.జహంగీర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు అంటే పట్టని వాళ్ళు డబ్బులు పదవే పరమావధిగా భావించే వాళ్లే నేడు ఓట్ల కోసం వస్తున్నారని ఆయన అన్నారు. నిరంతరం ప్రజల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే గొంతులను చట్టసభలకు పంపించాలని ఆయన కోరారు. సుత్తీకొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టీ స్కైలాబ్ బాబు, దోనూరు నర్సిరెడ్డి, మండల కార్యదర్శి దోడ యాదిరెడ్డి, గుంటూరు శ్రీనివాసచారి పాల్గొన్నారు.


సంస్థాన్‌నారాయణపురం: మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు సీతారాములు

జహంగీర్ బలమైన ఇస్తాడు: చెరుపల్లి

భువనగిరి టౌన్: భువనగిరి పార్లమెంట్ బరిలో సీపీఎం అభ్యర్థి ఎండి.జహంగీర్ బలమైన పోటీ ఇస్తాడని, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. సోమవారం భువనగిరిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల బరి నుంచి సీపీఎం తప్పుకుంటుందంటూ సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. భువనగిరి సీపీఎం అభ్యర్థికి అభ్యుదయ వాదులు మద్దతివ్వాలని కోరారు. దేశానికి బీజేపీ అత్యంత ప్రమాదకరమైనదని, లాభం కోసం బీజేపీ నాయకులు ప్రజలను మతపరంగా విడదీస్తున్నారని విమర్శించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, జి.వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, కొండమడుగు నర్సింహ, నాయకులు ఆశాలత, దాసరి పాండు, దయ్యాల నర్సింహ పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలోని ప్రొద్దుటూరులో నిర్వహించిన ప్రచారంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారీ ఐలయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాటూరి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిరిపంగి స్వామి, మండల కార్యదర్శి సభ్యులు తుర్కపల్లి సురేందర్, కె రామ్‌చందర్, కూర శ్రీనివాస్, నాయకులు కృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

బీబీనగర్: లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద, విచ్ఛిన్నకర శక్తులను ఓడించి, ప్రజల పక్షాన పోరాడే సీపీఎం అభ్యర్థిని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేషం పిలుపునిచ్చారు. బీబీనగర్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పాలడుగు భాస్కర్, కొండమడుగు నర్సింహ, శోభన్ నాయక్, శ్రీనివాస్, రాజేశ్, వెంకటేశ్, భిక్షపతి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

చౌటుప్పల్ టౌన్ : పేద కుటుంబాలకు వైద్యసేవలను అందించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. చౌటుప్పల్ మునిసిపాలిటీలోని తాళ్లసింగారానికి చెందిన మాందారి నగేష్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును చైర్మన్ రాజు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బ్లాక్, మునిసిపాలిటీ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, సుర్వి నర్సింహ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి వచ్చే ప్రతీ వాహనాన్ని నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. సరైన ఆధారాలు లేకుండా డబ్బులు రవాణా చేస్తే స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సైదిరెడ్డి, సిబ్బంది శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వలిగొండ: వరంగల్‌లో కవులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐవైఎఫ్, జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ దాడులకు పాల్పడిన ఏబీవీపీ కార్యకర్తలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

భువనగిరి టౌన్: రాష్ట్ర స్ప్రింట్ మిడిల్ లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్‌లో భువనగిరి హనుమాన్ శిక్షణ కేంద్రం క్రీడాకారుల ప్రతిభ చూపారు. ఆదివారం సూర్యాపేటలో జరిగిన పోటీలలో పురుషుల విభాగంలో 1500 మీటర్ల విభాగంలో గుగులోత్ సునీల్ బంగారు పతకం, 600 మీటర్ల పరుగు పందెం అండర్-14 విభాగంలో మరికొండ గణేష్ కాంస్య పతకం సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను కోచ్ కోనేటి గోపాల్, శిక్షణ కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు మాటూరి వినోద్ అభినందించారు.

యాదగిరిగుట్ట రూరల్: ప్రపంచ కార్మికుల దినోత్సవం మే1 విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు పిలుపునిచ్చారు. సోమవారం గుట్ట సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. మే 1న సీపీఐ అనుబంధ కార్మిక సంఘాలు మేడే ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 138వ మేడే వేడుకలు జరుపుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గడ్డం నాగరాజు అన్నారు. మండలంలోని కొలనుపాకలో హమాలీ, మిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ధార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని ఆరోపించారు. లేబర్ చట్టాలను తీసుకువస్తూ కార్మికుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో బాల నర్సయ్య, జహంగీర్, రమేష్, భాస్కర్, రమేష్ ఉన్నారు.

ఆలేరు రూరల్: ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసే విషయమై అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం డిమాండ్ చేశారు. సోమవారం ఆలేరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయమై స్పష్టత తెలుపాలన్నారు.

ఆర్ జనార్ధన్ చెక్క వెంకటేష్, మొరిగాడి శేఖర్, సలీం, అడవయ్య, ఉప్పలయ్య, ప్రవీణ్, కృష్ణ, మల్లేశం ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ఎమ్మార్పీఎస్ మద్దతు: గణేష్


సమావేశంలో మాట్లాడుతున్న గణేష్

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మార్పీఎస్ కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు సంఘం ఆలేరు నియోజక వర్గ ఇన్‌చార్జి కుమ్మరికుంట్ల గణేష్ తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటుచేసిన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో గణేష్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి, అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత ఎమ్మార్పీఎస్ తీసుకుంటుందని తెలిపారు. భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం కోసం ఆలేరు నియోజకవర్గంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ముందుండి కృషిచేయాలన్నారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వస్పుపల స్వామి, నాయకులు వి.ఎల్లయ్య, ఎం.శ్రీనివాస్, పరుషరాములు ఉన్నారు.

హోటళ్ల యజమానులకు 2.50లక్షల జరిమానా

భువనగిరి టౌన్, ఏప్రిల్ 29: నాణ్యతలేని కల్తీ ఆహారాన్ని విక్రయిస్తున్న హోటల్స్‌పై అధికారులు గత నెల జిల్లాలోని పలు హోటల్స్‌పై జిల్లా ఆహార భద్రత అధికారులు ఆకస్మిక దాడులు చేసి సేకరించిన శాంపిల్స్‌కు ల్యాబ్‌లలో నిర్వహించిన నాణ్యత పరీక్షల్లో 10 హోటళ్లలో కల్తీ ఆహారం విక్రయిస్తున్నట్టు తెలిసింది. దీంతో ఆ హోటళ్ల యజమానులకు అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్ రూ.2.50 లక్షలు జరిమానా విధించారు. సోమవారం భువనగిరి పట్టణంలోని పలు హోటళ్లలో ఆహార భద్రత డిజిగ్నేటెడ్ అధికారి డాక్టర్ ఎం.సుమన్‌కళ్యాణ్, జిల్లా ఆహార భద్రత అధికారి స్వాతి ఆధ్వర్యంలో మరోమారు ఆకస్మిక తనిఖీలు చేసి, శాంపిల్స్‌ను సేకరించారు. హోటల్స్ నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ధాన్యంలో కోతపై అధికారి విచారణ

మోత్కూరు, ఏప్రిల్ 29: మోత్కూరు మార్కెట్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించగా, రైస్ మిల్లు యజమానులు తూకంలో కోత పెడుతున్నారని, బస్తాల ఎగుమతికి లారీ డ్రైవర్లు బస్తాకు రూ.3 చొప్పున అడుగుతున్నారని, హమాలీలు, చాట మహిళలు తమ ఇష్టానుసారం ధాన్యం తీసుకుంటున్నారని రైతు అవిశెట్టి కిరణ్‌కుమార్‌తో పాటు పలువురు ఆదివారం పత్రికల ద్వారా వెలుగులోకి తెచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆలేరు ఆర్ఐ హరిశ్చంద్రారెడ్డిని విచారణాధికారిగా నియమించింది. ఆయన సోమవారం మోత్కూరు మార్కెట్‌కు వెళ్లి విచారణ జరిపారు. కిరణ్‌కుమార్ ధాన్యం తూకం వేసిన తర్వాత మిల్లుకు పంపడంలో నాలుగు రోజులు జాప్యం జరిగిందని, దీంతో ఎండ తీవ్రతకు ధాన్యం తూకం తగ్గడంతో ఆత్మకూరు శివసాయి మల్లికార్జున రైస్ మిల్లు యజమాని తూకం తగ్గించారని, ధాన్యం కొనుగోలులో ఎలాంటి అవకతవకలు జరుగలేదని ఆయన నివేదిక ఇచ్చినట్టు జిల్లా పౌరసరఫరాల కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. కాగా విచారణాధికారి విలేకరులకు విషయాలు చెప్పిన తననుగాని, ఇతర రైతులను గాని విచారించలేదని రైతు అవిశెట్టి కిరణ్ తెలిపారు.

బీరప్ప కల్యాణంలో ప్రజాప్రతినిధులు, అభ్యర్థులు

భువనగిరి రూరల్, ఏప్రిల్ 29: భువనగిరి మండలంలోని అనంతారంలో బీరప్ప కామరాతి కల్యాణోత్సవం సోమవారం అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. భువనగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి జడ్పీటీసీ బీరుమల్లయ్య పల్గొన్నారు.

ఐదు మాసాల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత

● మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

మోత్కూరు, ఏప్రిల్ 29: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడంతో ఐదు మాసాల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. సోమవారం మోత్కూరు ఆర్యవైశ్య భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రజలు బీఆర్ఎస్‌ను కోరుకుంటున్నారన్నారు. తుంగతుర్తి నియోజక వర్గంలో బీఆర్ఎస్ పార్టీ జెండాను, నాయకులను, కార్యకర్తలను కాపాడే బాధ్యత తనదేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్లమెంటు ఎన్నికల్లో భువనగిరి ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను గెలిపించుకునేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మే 10న మోత్కూరు పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా నిర్వహించనున్న బైక్ ర్యాలీలో అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కూసంపల్లి నర్సయ్య ఇంటికి వెళ్లి ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమాల్లో సింగిల్ విండో చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్, మదర్ డెయిరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, వైస్‌ఎంపీపీ బుషిపాక లక్ష్మీ, మార్కెట్ మాజీ చైర్మన్లు తీపిరెడ్డి మేఘారెడ్డి, కొణతం యాకూబ్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్లు సామ పద్మారెడ్డి, పురుగుల మల్లయ్య, నాయకులు జంగ శ్రీనివాస్, కొండ సోంమల్లు, బయ్యని పిచ్చయ్య, దబ్బెటి శైలజ, మల్లం అనిత, కట్ట ఇంద్రజ్యోతి, అవిశెట్టి స్వామి, గిరగాని శ్రీను, దేవా, కంచర్ల క్రాంతికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ కు చెందిన మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. చౌటుప్పల్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, కళ్లబొల్లి మాటలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో చేతులు ఎత్తేసిందని, పేద ప్రజలతో పాటు రైతులను మోసం చేసిందని ఆయన అన్నారు. భువనగిరి ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ ను గెలిపించేందుకు కార్యకర్తలు కంకణబద్ధులై పని చేయాలని ఆయన కోరారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్, ఉపాధ్యక్షుడు చిన్నం బాలరాజ్, ప్రధాన కార్యదర్శి డిల్లీ మాధవ రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఊడుగు మల్లేశ్, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, నాయకులు జి. వెంకటేశ్, ఎ. కిష్టయ్య, ఎ.యాదగిరి, ఆకాష్‌రెడ్డి, పర్వతాలు పాల్గొన్నారు.


మోత్కూరు: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

నాయకులు వెళ్లినంత మాత్రాన పార్టీకి నష్టం లేదు

సంస్థాన్ నారాయణపురం: తల్లి లాంటి బీఆర్ఎస్ పార్టీని మోసం చేసి కొంతమంది నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరినంత మాత్రాన బీఆర్ఎస్ పార్టీకి వచ్చే నష్టం ఏమీ లేదని, బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని నారాయణపురం బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చిలువేరు బిక్షం అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో ఉండి ఉన్నత పదవులు అనుభవించి, ప్రభుత్వం మారి నాలుగు నెలల కాకముందుకే వేరే పార్టీలో చేరడం సిగ్గుచేటు అన్నారు. సమావేశంలో ఎడ్ల సత్తయ్య, కొండూరు ముత్యాలు, బొడ్డుపల్లి గాలయ్య, జక్కడి యాదిరెడ్డి, రాసాల వెంకటేశం, సోమనబోయిన చంద్రశేఖర్, ఆంజనేయులు, నాగరాజు పాల్గొన్నారు.